క్లుప్తంగా

రైల్వే సహాయ మంత్రిని కలసిన ఎమ్మెల్సీ



కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రికి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: గుంతకల్లు రైల్వే డివిజన్ పర్యటకు విచ్చేసిన కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రి రావు సాహెబ్‌పాటిల్ ధన్వేను గురువారం గుంతకల్లులో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కలసి పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేటీకరించడానికి దశల వారీగా ముందుకు వెళ్తోందన్నారు. దీంతో రైల్వే శాఖలో పనిచేసే 12 లక్షల మంది ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అలాగే పేద, మధ్యతరగతి ప్రజల ప్రయాణ ఖర్చులు పెరుగుతాయన్నారు. గుంతకల్లు నుంచి రాయదుర్గం వరకూ రైల్వే లైన్ దాదాపు వంద కిలోమీటర్లు దూరం ఉందని, గుంతకల్లు నుంచి కళ్యాణదుర్గానికి వయా ఉరవకొండ, బెళుగుప్ప మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేసినట్లయితే దాదాపు 20 కిలోమీటర్లు తగ్గుతుందన్నారు. సాధ్యాసాధ్యలను పరిశీలించి కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా 15 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగే గ్రామసభలకు సచివాలయసిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు. గ్రామ పంచాయతీల్లో అమలు చేసిన కార్యక్రమాలు, కార్యకలాపాల స్థితిగతులు, అభివృద్ధి పనులు , ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్ గురించి గ్రామసభల్లో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

చర్చిల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది




పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభలో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం చర్చిల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక గుడ్‌షెఫర్డ్ చర్చిలో ఉరవకొండ నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చర్చిలకు ప్రహరీలు, భవన నిర్మాణాలకు సహకారం అందిస్తామన్నారు. ముఖ్యంగా ఉరవకొండలో క్రిస్టియన్ కమ్యూనిటీ భవనానికి స్థలంతో పాటు నిర్మాణానికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. పాస్టర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యనాథ్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి జాషవానంద్, సహాయ కార్యదర్శి విక్రమ్‌పాల్, కోశాధికారి సురేష్, గౌరవ సలహాదారు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై 15న సమావేశం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలను మే 3 నుంచి నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి కె.నరసింహారెడ్డి గురువారం తెలిపారు. ఉత్సవాల నిర్వహణపై మరోసారి పాలకవర్గ సభ్యులు, పట్టణ ప్రజలు, పుర ప్రముఖులతో సలహాలు, సూచనల కోసం ఆలయంలో 15వ తేదీ ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. సమావేశానికి హాజరై సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. సమావేశానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు.

సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



కణేకల్లు: సంక్షేమ పథకాలను వివరిస్తూ బ్రోచర్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ రూరల్: వైఎస్సార్ జలకళ ద్వారా లబ్ధిపొందిన రైతులకు మోటార్లను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే విశ్వ

కణేకల్లు: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మసముద్రంలో గురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు కురుబ వన్నప్ప, మాజీ సర్పంచు లోకేష్‌గౌడ్, నాయకులు సురేష్‌రెడ్డి, మనప్పాచారితో కలసి విప్ కాపు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే చేరుస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తిసామర్థ్యాలు జగనన్నకే ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు అండ్ కో 'నీరు–చెట్టు' పథకం పేరుతో పందికొక్కులా మెక్కి ఆస్తులను కూడబెట్టారన్నారు. జగనన్న పాలనలో ఏ గ్రామంకెళ్లి చూసినా గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలు దర్శనమిస్తున్నాయన్నారు. 'నాడు–నేడు'తో స్కూళ్లు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, బ్రహ్మసముద్రం పీఏసీఎస్ అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, మాజీ అధ్యక్షులు వెంకటేశ్‌రెడ్డి, గోపులాపురం ప్రకాష్‌చౌదరి, నాయకులు కురుబ కిశోర్‌గౌడ్, ఉత్తేజ్, హనుమంతరెడ్డి, మహబూబ్‌బాషా, బోయ వన్నూరుస్వామి, పాముల సర్మస్, యంత్రకాయల వన్నూరప్ప, కెనిగుంట రామిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, నగేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ రైతులకు వరం

ఉరవకొండ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ జలకళ' రైతులకు వరంలాంటిదని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని మోపిడి గ్రామంలో గురువారం రెండో రోజూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రజలు చిన్న చిన్న సమస్యలు తెలియజేయగా.. సంబంధిత అధికారులతో అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఆయన వైఎస్సార్ జలకళ ద్వారా లబ్ధి పొందిన రైతులకు మోటారు, పంపుసెట్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాలకు వివిధ రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. వాటిలో భాగంగానే రైతులకు ప్రతి సంవత్సరం పంట పెట్టుబడి కోసం రైతు భరోసా, పావలా వడ్డీ, ఉచిత బీమా, వైఎస్సార్ జలకళ పథకం అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా లబ్ధి పొందిన రైతులకు ప్రభుత్వమే ఉచితంగా బోరు, విద్యుత్, మోటార్లను సైతం ఉచితంగా దాదాపు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షలను ప్రభుత్వం ఖర్చుచేసిందన్నారు కార్యక్రమంలో సర్పంచ్ సిద్దార్థ, ఎంపీటీసీ సుధ, వైస్ ఎంపీపీ నరసింహులు, సచివాలయాల కన్వీనర్ తేజోనాథ్, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అశోక్, యువజన నాయకుడు రాజేష్, ఉపసర్పంచ్ లాలెప్ప, ప్రసాద్, పెద్దన్న, ఓబన్న, ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత

- దివ్య సుగంధాల రంజాన్ మాసం
- ఉపవాస దీక్షాపరులు, నమాజ్‌లతో మసీదులు కళకళ



దువా పఠిస్తున్న చిన్నారులు

రాయదుర్గంటౌన్: ముస్లింల పవిత్ర మాసం రంజాన్. దివ్య ఖురాన్ కూడా ఈ మాసంలోనే దివి నుంచి భువిపైకి అవతరించింది. ఈ మాసానికి ఇస్లాంలో ప్రత్యేక స్థానం ఉంది. నెల రోజుల పాటు ముస్లింలు తెల్లవారుజాము నుంచి సూర్యాస్తమయం వరకూ నిష్ఠతో కఠోర ఉపవాస దీక్షలు పాటించి దైవారాధనలో గడుపుతారు. చిన్నారులు, వృద్ధులు సహా ప్రతిఒక్కరూ నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి భక్తిభావంతో ప్రత్యేక నమాజులను ఆచరిస్తున్నారు. రోజూ ఐదు పూటల నమాజులతో పాటు ప్రత్యేకంగా తరావీ ప్రార్థనలు కూడా చేస్తున్నారు. దివ్య ఖురాన్ పఠిస్తున్నారు. ముఖ్యంగా సహరీ, ఇఫ్తార్ సమయంలో మసీదుల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటోంది. ఇఫ్తార్ విందులతో మసీదులు కిటకిటలాడుతున్నాయి.

దివ్య ఖురాన్, హదీస్ ఇస్లాంకు పవిత్ర మత గ్రంథాలు. భక్తిగా ఉండడం, దైవ ప్రార్థనలు చేయడంతోపాటు మద్యపానం, అపద్దాలు ఆడడం, చాడీలు చెప్పడం తదితర దురలవాట్లకు దూరంగా ఉండాలని ఈ గ్రంథాలు బోధిస్తాయి. ఉపవాసం ఆచరించే వారంతా తెల్లవారుజామున తీసుకునే సహరి నుంచే దైవ చింతనలో గడుపుతారు. పగలంతా ఉపవాస దీక్షను ఆచరించడం, సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్ చేశాక రాత్రి ప్రత్యేక తరావీ ప్రార్థనల్లో పాల్గొంటారు. సహరి, ఇఫ్తార్ చేసేందుకు సౌకర్యం లేని వారికి, పేదల కోసం కొన్ని మసీదుల్లో ఉదయం, సాయంత్రం ఏర్పాట్లను చేస్తారు. ఖురాన్ బోధనలు చేసేందుకు మత గురువుల (హాఫీజ్)లను మసీదులలో నియమించుకుంటారు.

రంజాన్ ఉపవాసాలు మూడు భాగాలు...

రంజాన్ మాసాన్ని మూడు భాగాలుగా వర్గీకరిస్తారు. ప్రస్తుతం ఒకటో భాగం పూర్తయి రెండో భాగంలో రంజాన్ దీక్షలు కొనసాగుతున్నాయి. మొదటి పది రోజులు దైవ కారుణ్యానికి ప్రతీక. తర్వాత పదిరోజులు క్షమాభిక్షకు ప్రతీక. చివరి పది రోజులు నరకం నుంచి విముక్తికి ఉపకరిస్తాయని దైవ ప్రవక్త మహమ్మద్(సొఅసా) అభివర్ణించారు. అలాగే జకాత్ రూపంలో ధాన, ధర్మాలు చేసి పేదలను ఆదుకోవడం, పేదవాని ఆకలి తీర్చడం కోసం ముస్లింలు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి ముస్లిం తన స్థిర, చరాస్తుల నుంచి 2.5 శాతాన్ని అల్లా మార్గంలో పేదలకు తప్పనిసరిగా ఇవ్వాలని ఖురాన్ చెబుతోంది. దీన్ని జకాత్ అంటారు. జకాత్‌తోపాటు ఫిత్రా దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. మూడుపూటల తిండికి, ఒంటినిండా దుస్తులకు నోచుకోని పేదవారు ఎంతో ఉండి ఉంటారు. ఇలాంటి అభాగ్యులు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం మతం ఉద్బోధిస్తుంది. దీన్నే ఫిత్రాదానం అంటారు. దీక్షను విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్‌లు సోదరభావం, సౌభ్రాతృత్వానికి పెద్దపీట వేస్తాయి. సాయం సంధ్య వేళ మసీదుల వద్ద చేపట్టే ఇఫ్తార్‌తో సోదరభావం పెంపొందుతోంది. మొత్తం మీద మసీదులు, ఇళ్లలో రంజాన్ మాసమంతా ఆధ్యాత్మికతో కూడిన వాతావరణం ఉంటుంది.

మహిళ మెడలో బంగారు చైన్ అపహరణ

కణేకల్లు: కణేకల్లులోని ఉరవకొండ రోడ్డు వద్ద ఇద్దరు చైన్‌స్నాచర్స్ గురువారం వేకువజామున ఓ మహిళ మెడలో ఉన్న బంగారు చైన్‌ను అపహరించారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి కథనం మేరకు.. నాగులకట్ట వద్ద నివాసముంటున్న అరుణ రాత్రి ఇంట్లో నిద్రపోయింది. వేకువజామున మూడు గంటల సమయంలో బయట ఉన్న బాత్‌రూంకు రాగా.. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమెపై దాడి చేశారు. ఒకరు బలవంతంగా నోరు మూయగా... మరోకరు చైన్‌ను లాక్కొన్నారు. నాలుగు తులాలున్న ఈ చైన్ విలువ రూ.1.20లక్షలు ఉంటుందని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రచార భేరి పోస్టర్ల విడుదల

ఉరవకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకూ సీపీఐ, సీపీఎం నిర్వహించే ప్రచారభేరి పోస్టర్లను గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీ నేతలు విడుదల చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి కురుకుంట మనోహర్‌మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొడుతూ ప్రచార భేరి సభ నిర్వహిస్తామన్నారు. నాయకులు రమణప్ప, మల్లేష్, సుల్తాన్, రమేష్, నారాయణమ్మ, నూర్జహాన్, వన్నూరమ్మ పాల్గొన్నారు.

రాగిజావకు గ్లాసుల సరఫరా

రాయదుర్గంటౌన్: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు అదనపు పౌష్టికాహారంగా ఇటీవల ప్రభుత్వ పా ఠశాలల్లోని విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం కింద రాగి జావ అందజేస్తున్న విషయం తెలిసిందే. విద్యార్థులకు రాగిజావ పంపిణీకి నాణ్యమైన గ్లాసులను ప్రభుత్వం సరఫరా చేసింది. ఇప్పటికే జిల్లా కేంద్రాల నుంచి మండలాల్లోని విద్యాశాఖ కార్యాలయాలకు గ్లాసులు సరఫరా అయ్యాయి. గురువారం ఆ గ్లాసులను ఎంఈఓ నాగమణి పరిశీలించారు. పాఠశాలల వారీగా గ్లాసులను హెచ్‌ఎంలకు అందజేస్తామన్నారు. రాయదుర్గం అర్బన్, మండలంలోని 80 పాఠశాలల్లోని 14,760 మంది విద్యార్థులకు గ్లాసులు సరఫరా అయినట్లు ఆమె తెలిపారు.

వడ్డెర్ల సంఘం కమిటీ నియామకం

వజ్రకరూరు: వడ్డెర్ల సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడుగా పెద్ద శ్రీనివాసులు ఎంపికకయ్యారు. గురువారం స్థానికని పెద్దమ్మ దేవాలయంలో వడ్డెర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎంపిక చేశారు.అధ్యక్షుడిగా పెద్ద శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా గాలెప్ప, ట్రెజరర్‌గా యోగానంద, కార్యదర్శిగా రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా శీనా ఎంపికయ్యారు. కమిటీ సభ్యులుగా నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, గణేష్, శ్రీనివాసులు, రాజును ఎంపిక చేశారు. స్థానికులు రమేష్, గోపాల్, ఆదినారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిరిడీసాయి ఆలయంలో గురువారం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి క్షీరాభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్న హారతి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం చేపట్టారు. రాత్రి శేజ్ హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అనంతస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాపంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: మండలంలోని మోరేపల్లి గేట్ సమీపంలో చెట్టును కారు ఢీకొన్న ఘటనలో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సమీప బంధువులు తిప్పేస్వామి, అంజినప్ప గాయపడ్డారు. కర్ణాటకలోని చిత్రదుర్గకు చెందిన వారు గురువారం ఉదయం కారులో కుందుర్పి మీదుగా కళ్యాణదుర్గం వైపు వస్తుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొంది. తిప్పేస్వామికి ఎడమ చేయి, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో అంజనప్ప బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ తన పర్యటనను మధ్యలోనే విరమించుకుని ఆగమేఘాలపై ఘటనా స్థలానికి చేరుకున్నారు. తిప్పేస్వామిని పరామర్శించి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందేలా సహకరించాలని తన వ్యక్తిగత కార్యదర్శి దేవదాసుకు సూచించి, క్షతగాత్రుల వెంట కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి పంపారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్రదుర్గానికి అంబులెన్స్‌లో తరలించారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు

కళ్యాణదుర్గం: స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం సాంఘిక సంక్షేమాధికారి నరసింహారావు తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు. అధికారులు, అనధికారులు, ప్రజా సంఘాల నాయకులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి ఈనెల 20లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.ధనలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



సర్పంచ్ తిమ్మక్క (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని ఏలంజి గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు తిమ్మక్క (55) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గత కొద్దిరోజులుగా ఆమె కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఐదు రోజుల క్రితం బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందింది. తిమ్మక్క రెండుసార్లు ఏలంజి పంచాయతీకి సర్పంచ్‌గా గెలుపొందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ నీలవేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు సానుభూతి తెలిపారు. తిమ్మక్కకు భర్త తిమ్మప్ప, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం



బైరసముద్రంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చేపడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

బ్రహ్మసముద్రం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. గురువారం బ్రహ్మసముద్రం మండలంలోని పిల్లలపల్లి, నాగిరెడ్డిపల్లి, బైరసముద్రంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. ముందుగా పిల్లలపల్లిలో గ్రామ దేవత కువ్వాడమ్మ ఆలయంలో మంత్రి శ్రీచరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల ప్రజాప్రతినిధులతో కలిసి మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ.. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో జరుగుతున్న అభివృద్ధి పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య సంక్షేమ పథకాల్లో వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలకతీతంగా సీఎం జగనన్న పరిపాలనకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, జెడ్పీటీసీ ప్రభావతి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మండల నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, హనుమంతరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ తలారి గోవిందప్ప, మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన



కంబదూరు: కొత్తపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



వజ్రకరూరు: పీసీ ప్యాపిలిలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నట్లు రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి శంకరప్ప, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి, పాళ్లూరు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగమూర్తి, సచివాలయ కన్వీనర్లు నాగన్న, కిరణ్, నాయకులు బసవరాజు, సునీల్‌కుమార్, క్రాంతి, గురు పాల్గొన్నారు.

మరో 30 సంవత్సరాలు సీఎంగా జగనే ఉండాలి

వజ్రకరూరు: రాష్ట్రానికి మరో 30 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని వృద్ధులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామసచివాలయం–2 పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ ఉస్మాన్, వలంటీర్ నీలకంఠారెడ్డి, గృహసారథులు సికిందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పీసీ ప్యాపిలిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ సుంకమ్మ, సర్పంచు జ్యోతిభాయి, యువజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్, మాజీ సర్పంచు ఎర్రిస్వామి, నాయకులు ప్యాపిలి రమేష్, కిష్టప్ప, అర్జున్, భీమా, రామాంజినేయులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సంఘాల సభ్యులకు మెగా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కళ్యాణదుర్గం: ప్రభుత్వం సెర్ప్, మెప్మాల ద్వారా బ్యాంకర్ల సహకారంతో అందిస్తున్న ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగాలని కెనరా బ్యాంక్ ఏజీఎం రాఘవ లారెన్స్, ఎల్‌డీఎం నాగరాజరెడ్డి సూచించారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో గురువారం కెనరా బ్యాంక్ పరిధిలోని సంఘాల సభ్యులకు రుణమేళా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కెనరా బ్యాంక్ పరిధిలోని 46 మహిళా సంఘాలకు రూ.5.76 కోట్ల వివిధ జీవనోపాధుల కార్యక్రమాలకు ఖర్చు చేశామన్నారు. అనంతరం బీమా, పొదుపు పథకాలు, బల్క్ యూనిట్, వివిధ రుణాల గురించి వివరించారు. సీనియర్ ఆర్‌ఓ శ్రీధర్, బ్రాంచ్ మేనేజర్ జీవీఆర్ మోహన్, సబ్ మేనేజర్ పవన్, ఫీల్డ్ ఆఫీసర్ ఫిరోజ్, మెప్మా సీఓలు, సెర్ప్ వైకేపీ– డీఆర్‌డీఏ సీసీలు, వీఏఓలు, అకౌంటెట్‌లు, పట్టణ సమాఖ్య లీడర్లు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణతో ప్రయోజనం



వజ్రకరూరు: పొలంలో మట్టి నమూనా సేకరిస్తున్న అధికారులు



శెట్టూరు: భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఏఓ సంధ్యాకుమారి

వజ్రకరూరు: మట్టి నమూనాల సేకరణతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శంకర్‌లాల్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మట్టి పరీక్షల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వజ్రకరూరులోని రైతుభరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం రైతు భీమిరెడ్డి పొలంలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.మట్టి ఎలా తీయాలో క్షేత్ర స్థాయిలో సిబ్బందికి వివరించారు. ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ప్రతి రైతూ పొలంలో మట్టి నమునాలు తీయించుకోవాలని, తద్వారా ఏ పంట సాగు చేయాలి? ఎంతమేర ఎరువులు వాడాలి? తదితర వాటిపై రైతులకు అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎం.ఆర్.శ్రీనివాస్, సర్పంచు మోనాలిసా, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో తగ్గనున్న పెట్టుబడులు

శెట్టూరు: భూసార పరీక్షల అనంతరం రైతులు పంటలు సాగుచేసి భూమిలో లేని ఎరువులను ఉపయోగించడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయని మండల వ్యవసాయ అధికారిణి సంధ్యాకుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు నాగరాజు పొలంలో వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు నిర్వహించి ఆర్బీకే సిబ్బందికి అవగాహన కల్పించారు. ఖరీఫ్ సమీపిస్తున్నందున రైతులు పొలాల్లా భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని రైతులకు సూచించారు. ఆర్బీకే సిబ్బందికి మట్టి నమూనా తీసే విధానం, నమూన అవశ్యకత గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఆర్బీకే కేంద్రంలో సాయిల్ హెల్త్‌కార్డు, వాటి వల్ల రైతులకు ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయులు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యంతో అధికారులు

కళ్యాణదుర్గం: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన పక్కా సమాచారంతో గురువారం ఉదయం కళ్యాణదుర్గంలోని రాయదుర్గం రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద ఐటీపీ రామారావు, ఏఈఈ రాజశేఖర్, సీఎస్‌డీటీ సుబ్రహ్మణ్యం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 44 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. బొలెరో డ్రైవర్, కర్ణాటకలోని దావణగెరె నివాసి ఎం.ఎం.అజిత్, బియ్యం సేకరణకు సహకరించిన కణేకల్లు నివాసి బసవరాజ్ స్వామి, దావణగెరె జిల్లాకు చెందిన వాహన యజమాని మంజులపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశారు. వాహనాన్ని సీజ్ చేశారు.